సాక్షి
బాపట్ల
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



హనుమాన్ చాలీసా పారాయణం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని ఆర్య వైశ్య అన్నదాన సత్రంలో చాతుర్మాస దీక్ష ధ్యాన తరగతులు సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం నిర్వహించారు.



దిగువకు 36,950 క్యూసెక్కులు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 33,490 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 36,950 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 6636 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1760 క్యూసెక్కులు వదిలారు.

ఇసుక తోడేస్తున్నారు

యథేచ్ఛగా ఇసుక అక్రమ విక్రయాలు చేస్తున్న కూటమి నేతలు

పగలు, రాత్రి తేడా లేకుండా కొల్లూరు మండలంలోని కృష్ణానది తీర ప్రాంతంలో ఇసుకాసురులు విజృంభిస్తున్నారు.. చీమలదండును తలపించేలా ట్రాక్టర్లను ఆయా తీరాలకు తరలిస్తూ, అక్రమంగా ఇసుకను తోడేస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినదగ్గర నుంచి ఆ పార్టీల నేతలు, వారి అనుచరులు ఇసుక అక్రమ రవాణాకు గేట్లు తెరిచి సహజ వనరులను అడ్డంగా దోచుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ మిన్నకుండిపోతున్నారు. అక్రమార్కుల ఆగడాలకు అరవింద వారధి మనుగడ సైతం ప్రమాదంలో పడటం ఆందోళన రేకెత్తిస్తోంది.

- ఇసుక అక్రమ రవాణాకు తెరుచుకున్న గేట్లు
- కృష్ణా నదిలో ఇసుక ట్రాక్టర్ల జాతర
- పోటాపోటీగా తవ్వుకుని సొమ్ము చేసుకుంటున్న వైనం
- అరవింద వారధి మనుగడకు పెను ముప్పు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి వద్ద నుంచి పట్టపగలు అక్రమంగా ఇసుక లోడ్ చేసుకొని వెళుతున్న ట్రాక్టర్లు

కొల్లూరు: ఇసుక అక్రమ రవాణా దారుల ఆగడాలు రోజురోజుకు శ్రుతి మించుతున్నాయి. అధికార కూటమి పార్టీ నాయకులు, వారి అనుయాయులు.. ప్రజాప్రతినిధులు సైతం బాహాటంగా ఇసుక అక్రమ రవాణాకు గేట్లు తెరచి తవ్వుకో.. దోచుకో అన్న చందంగా ఇసుక తరలించుకుపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాను నిలువరించడానికి ఏర్పాటు చేసిన పోలీసులే, ఇతర ప్రభుత్వ యంత్రాంగం కనుచూపు మేరలో కానరాకపోవడంతో జాతరను తలపించేలా ట్రాక్టర్లు కృష్ణానదిలోకి ప్రవేశించి ఇసుక అక్రమ రవాణాకు పోటీపడుతున్నాయి.

బహిరంగ రహస్యమే..

ఎడ్ల బళ్లతో ఇసుక తరలింపునకు ఆంక్షలు పెట్టి అడ్డుకుంటున్న అధికార యంత్రాంగం ట్రాక్టర్లలో యథేచ్ఛగా పట్టపగలే అక్రమంగా ఇసుక తరలించుకుపోతుంటే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారుల తీరుపై బాహాటంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పెసర్లంక – పెదలంక అరవింద వారధి, గాజుల్లంక, జువ్వలపాలెం ప్రాంతాలలోని కృష్ణానది నుంచి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలుతున్న విషయం బహిరంగ రహస్యంగా మారింది. జనసైనికులు, టీడీపీ నాయకుల అనుచరులు, కూటమికి చెందిన ఓ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి పోటాపోటీగా ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడానికి పోటీపడుతున్న వైనాన్ని చూసి సాధారణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.



కొల్లూరులో ఇసుక లోడ్‌తో నిలిపి ఉంచిన ట్రాక్టర్

అక్రమంగా తరలిస్తున్న ఇసుకను భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె, వేమూరు, చుండూరు, అమృతలూరు, తెనాలి ప్రాంతాలకు తరలించి ట్రాక్టర్ ఇసుక దూరాన్ని బట్టి రూ. 5 వేల నుంచి రూ. 7 వేల వరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక ట్రాక్టర్లు నదిలోకి దిగకుండా అధికారులు ఒక వేళ కట్టడి చేసిన పక్షంలో అక్రమ ఇసుక రవాణా ఆగకుండా ట్రాక్టర్లు, లారీల యజమానులు ఎడ్ల బళ్లతో ఒడ్డుకు ఇసుక తోలించుకొని తమ వాహనాలలో లోడింగ్ చేయించుకొని తరలించుకొని వెళుతున్నారు.

ముడుపుల వల

ఇసుక అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపులో ప్రభుత్వ యంత్రాంగానికి ముడుపుల వల విసరడంతో పట్టపగలే ఇసుక తరలింపు చేపడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రిళ్లు వందల సంఖ్యలో తరలుతున్న ట్రాక్టర్లకు వాటి యజమానులు కూటమి పార్టీకి చెందిన వ్యక్తుల ద్వారా పోలీసులకు ముడుపులు ముట్టచెప్పడంతో అక్రమ రవాణా మూడు పువ్వులు.. ఆరు కాయలు చందంగా సాగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తుంది.

అరవింద వారధి మనుగడకు పెనుముప్పు

అక్రమ ఇసుక తవ్వకాలు కృష్ణా నది మధ్యలో ఉన్న పది లంక గ్రామాల రాకపోకలకు ఏకైక మార్గంగా ఉన్న అరవింద వారధి మనగడకు పెనుముప్పుగా మారనున్నాయి. గతంలో చేపట్టిన ఇసుక తవ్వకాల ఫలితంగా, ఇటీవల సంభవించిన కృష్ణా నది వరదల ప్రభావంతో పెసర్లంక వైపున అరవింద వారధి ప్రారంభ ప్రాంతం ఇప్పటికే ఓ పక్కకు వాలింది. బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన పెదలంక, చింతర్లంక, ఈపూరులంక, కొత్త ఈపూరులంక, సుగ్గునలంక, చిలుమూరులంక, అన్నవరపులంక, కొత్తూరులంక, మునగపల్లిలంక, కనిగిరిలంకకు చెందిన సుమారు 8 వేల మంది జనాభా రాకపోకలు కోసం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన అరవింద వారధి మనుగడను సైతం అధికారులు విస్మరించి అక్రమ ఇసుక తవ్వకాలను నిలువరించకపోవడంపై ప్రజలలో ఆగ్రహం వ్యక్తమవుతుంది.



ఓ పక్కకు ఒరిగిన పెసర్లంక అరవింద వారధి ప్రారంభ ప్రాంతం

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈవోగా జ్యోతిబసు బాధ్యతల స్వీకరణ



గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ సీఈవోగా వి.జ్యోతిబసు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జెడ్పీ అతిథి గృహంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జ్యోతిబసును డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

32 మంది సచివాలయ మహిళా పోలీసులు బదిలీ

నరసరావుపేట: పల్నాడు జిల్లాతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 32 మంది మహిళా పోలీసులను వారు కోరుకున్న ప్రదేశాలకు బదిలీ చేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఈనెల 21న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు మంగవారం వెలుగులోకి వచ్చాయి. వీరందరూ సంబంధిత ఎంపీడీవోలకు రిపోర్టు చేసి తమ విధుల్లో చేరాలని ఎస్పీ ఆదేశించారు.

పొంగిన చంద్రవంక వాగు



మాచర్ల: మాచర్ల పట్టణం, రూరల్ ప్రాంతాలలో సోమవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు చంద్రవంక పొంగి పొర్లింది. మాచర్ల నుంచి జమ్మలమడక, తుమ్మకోటకు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఇన్‌చార్జి కమిషనర్ నాగేశ్వరరావు, డి నాగభూషణం, అర్బన్ సీఐ ప్రభాకరరావులు చంద్రవంక వాగును పరిశీలించారు. అనంతరం పురపాలక సంఘం వారు బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను జేసీబీ ద్వారా తొలగించారు. ప్రజలెవరూ వాగు వైపు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పలు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,200, ఎడమకాలువకు 3,849, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,217, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 44,666 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అంతే నీటిని ఇక్కడ నుంచి విడుదల చేస్తున్నారు.

చేనేత స్టాల్స్ సందర్శన



మంగళగిరి: మంగళగిరి ఆటోనగర్‌లో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాల్స్‌ను చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత, కమిషనర్ రేఖారాణిలు మంగళవారం సందర్శించారు. కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత మాట్లాడుతూ చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచడం కోసం ఏపీఐఐసీలో స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించి పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ వనజ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో శాంతియుత జీవనం

గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పార్థసారధి



రేపల్లెరూరల్: ఖైదీలు శాంతియుత మార్గాన్ని ఎంచుకుని సత్ప్రవర్తన నడుచుకోవాలని గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పార్థసారధి చెప్పారు. పట్టణంలోని సబ్‌జైల్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు తమతో పాటు తమ కుటుంబ సభ్యులు సైతం ఇబ్బందులపాలు కావాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ఇప్పటి నుంచైనా పగలు ప్రతీకలను, రాగద్వేషాలను వీడి శాంతికాముకులుగా జీవించాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరాతీశారు. వివిధ రకాల చట్టాలను వివరించారు. గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి లీలావతి, సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, న్యాయవాదులు కె.శ్రీవాణి, కుమార్ పాల్గొన్నారు.

యార్డుకు 48,267 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 48,267 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 46,245 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది.

భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్న బాబు

- ఎన్నికల హామీలు అమలు చేయలేకే చంద్రబాబు దిగజారుడు రాజకీయం
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రేపల్లె రూరల్: రాజకీయ స్వార్థంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతినేలా శ్రీవారి ప్రసాదంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. గుళ్లపల్లిలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయలేక జగన్‌మోహన్‌రెడ్డిపై ఏదోక నిందవేయాలన్న ఉద్దేశ్యంతోనే శ్రీవారి ప్రసాదంపై వ్యాఖ్యలు చేయటం తగదన్నారు. రాజకీయంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఎదుర్కొనలేకే సనాతన ధర్మంపై విమర్శలు చేస్తున్నారన్నారు.

- టీటీడీ శ్రీవారి ప్రసాదానికి వినియోగించే నెయ్యితో పాటు ఇతర ముడి సరుకులకు అన్ని పరీక్షలు నిర్వహించిన తరువాతే ప్రసాదం తయారీకి అనుమతిస్తారన్న అంశం అందరికీ తెలిసిందేనన్నారు. సరుకులలో నాణ్యత తక్కువగా ఉంటే తిప్పి వెనక్కి పంపటం జరుగుతుందన్నారు. ఈ విధంగానే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–19 సంవత్సరాల మధ్య నాణ్యత లేదని 15సార్లు నెయ్యితో పాటు ఇతర ముడి సరుకులను వెనక్కి పంపటం నిజం కాదా అని ప్రశ్నించారు? ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న 2019 –24 మధ్యకాలంలో సరుకుల నాణ్యత లేదని వచ్చిన రిపోర్ట్ ఆధారంగా నెయ్యి, ఇతర ముడి సరుకులను 18 సార్లు తిప్పి పంపించివేశారని గుర్తు చేశారు. ఎంతో గొప్ప నియమ నిబంధనలు పాటిస్తున్న టీటీడీని అప్రతిష్టపాలు చేసేందుకు కూటమి పాలకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం జూన్ 12వ తేదీన అధికారంలోకిరాగా జూలై 12న తీసిన శాంపిల్స్ జూలై 23వ తేదీన ఫలితాలు వచ్చినట్లు చెబుతున్నారన్నారు. ఆ సమయంలో అధికారంలో ఉంది చంద్రబాబేనని తెలిపారు. జూలై 23న ఫలితాల వివరాలు వస్తే రెండు నెలల పాటు ఎందుకు మౌనంగా ఉన్నారో తెలియజెప్పాలన్నారు. సనాతన ధర్మాన్ని కించపరుస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు శ్రీవారి సన్నిధిలో బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. లేనిపక్షంలో శ్రీవారి ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

జిల్లాలో ఎరువుల కొరత ఉండకూడదు

జాయింట్ కలెక్టర్ ప్రఖార్ జైన్

బాపట్ల: కొరత లేకుండా ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖార్ జైన్ పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారులు ఎరువుల దుకాణాలను తప్పనిసరిగా తనిఖీలు చేయాలని సూచించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పంట నమోదు ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంట నమోదు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించాలని ఆదేశించారు. రైతులకు పంట నష్ట పరిహారం త్వరగతిన అందించడానికి పరిహార జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రఖార్ జైన్

కొండచిలువ కలకలం

జె.పంగులూరు: మండల పరిధిలోని బైట మంజులూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం కొండ చిలువ కలకలం రేపింది. గ్రామంలోని సచివాలయం వెనుక భాగంలో కొండచిలువ కనబడటంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని కొండచిలువని చంపేశారు. దీని పొడవు 10 అడుగుల పైనే ఉందని గ్రామస్తులు తెలిపారు. ఇంతవరకు గ్రామంలో కొండచిలువ కనపడిన దాఖలాలు లేవని, ఈ కొండ చిలువ ఎక్కడ నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా చిన్నపిల్లలు తిరుగుతుంటారని, కొండచిలువను ఎవరూ చూడకుంటే ఎంతో ప్రమాదం జరిగి ఉండేదని తెలిపారు. మృత కొండచిలువను చూసేందుకు గ్రామస్తులు ఎగబడ్డారు.



అలా సర్దుకున్నారు!

ఉపాధ్యాయ సర్దుబాట్లలో లోపాలు

- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులు
- ఒక యూనియన్‌కు చెందిన వారికి అనుకూలంగా వ్యవహరించారని ఉపాధ్యాయుల ఆరోపణ



మండల విద్యావనరుల కేంద్రం

వేటపాలెం: కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన తల్లికి వందనం కార్యక్రమానికి మంగళం పాడారు. అంతేకాకుండా ఆఖరికి ఉపాధ్యాయ బదిలీల్లో సైతం తమ వక్రబుద్ధిని చూపించారు. ఇందుకు నిదర్శనం సీనియారిటీ ప్రకారం ప్రమోషన్‌లు ఇవ్వకుండా సర్దుబాట్లు పేరుతో ఉపాధ్యాయులకు అన్యాయం చేశారు.

- ఇటీవల అన్ని మండలాల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని జీఓ 20, 117, 128 ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో ఉన్న నిబంధనల మేరకు ఉపాధ్యాయులను మండలస్థాయిలో సర్దుబాటు చేయాలని సూచించారు. అయితే దీన్ని ఆసరాగా తీసుకొని మండల విద్యాశాఖ అధికారులు వారికి అనుకూలంగా ఉన్నవారికి పెద్దపీట వేశారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఒక యూనియన్‌కి చెందిన ఉపాధ్యాయులకు అనుకూలంగా సర్దుబాట్లు చేశారని మరో యూనియన్‌కు చెందిన ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. వేటపాలెం మండల పరిధిలో 16 మంది ఉపాధ్యాయులను సర్దుబాట్ల పేరుతో వివిధ పాఠశాలలకు మార్పు చేశారు. అయితే ఇందులో ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కినట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

నిబంధనలు ఇలా..

మండలంలోని పాఠశాలల్లో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను తక్కువగా ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాల్సి ఉంది. ఈ కోవలో సీనియార్టీ ప్రకారం సీనియర్ ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు కేటాయించాల్సి ఉంది. తదుపరి సీనియారిటీ ప్రకారం జూనియర్ ఉపాధ్యాయులను యూపీ స్కూళ్లకి కేటాయించాల్సి ఉంది. ఇది ప్రభుత్వ సర్క్యులర్‌లోని సారాంశం.

జరిగింది ఇలా..

మండలంలో 16 మందిని వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఇందులో సోషల్ స్టడీస్‌కు చెందిన ఐదుగురు, గణితం సబ్జెక్ట్‌కు చెందిన ముగ్గురు, భౌతిక శాస్త్రానికి చెందిన ముగ్గురు, తెలుగుకు ఒకరు, సైన్స్ ఇద్దరు, ఇంగ్లిష్‌కు ఇద్దరిని సర్దుబాట్ల పేరుతో వివిధ పాఠశాలలకు కేటాయించారు. అయితే ఇందులో నిబంధనలు పాటించకుండా ఒక యూనియన్‌కు చెందిన ఉపాధ్యాయులకు వారికి దగ్గరలో ఉన్న పాఠశాలలకు మార్చారనేది ప్రధాన ఆరోపణ.

- సోషల్ స్టడీస్‌కి చెందిన ఉపాధ్యాయుల్లో అక్కాయిపాలెం పంచాయతీ సిద్దార్ కాలనీలోని ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడిని హైస్కూల్‌కి మార్చాల్సి ఉండగా అతనికి అనుకూలమైన కొణిజేటి చేనేతపురి కాలనీ లోగల యూపీ స్కూల్‌కి మార్చారు.
- మరో సీనియర్ ఉపాధ్యాయుడు చేనేతపురి కాలనీలోని యూపీ స్కూల్‌లో పనిచేస్తుండగా ఆయన్ను రావూరిపేటలోగల యూపీ ఉర్దూ స్కూల్‌కి మార్పు చేశారు.
- తదుపరి వరుస క్రమంలో ఉన్న మరో ఉపాధ్యాయుడిని కఠారివారిపాలెం లోగల యూపీ స్కూల్‌కు మార్పుచేశారు.
- ఈ క్రమంలో సీనియార్టీలో చివరిగా ఉన్న ఒక ఉపాధ్యాయురాలిని పందిళ్లపల్లి హైస్కూల్‌కి మార్చారు. ఇంకో ఉపాధ్యాయుడిని దేశాయిపేట హైస్కూల్‌కి మార్పు చేశారు. ఈ విధంగాని సీనియర్లను యూపీ స్కూళ్లకు, జూనియర్ల హైస్కూళ్లకు సర్దుబాట్లు చేసి నిబంధనలను తుంగలో తొక్కారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

నిబంధనల మేరకే సర్దుబాట్లు చేశాం..

ప్రభుత్వ నిబంధనల మేరకే ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. కొన్ని పాఠశాలల్లో మౌఖిక ఆదేశాల మేరకు సర్దుబాటు చేశాం. కొందరు ఉపాధ్యాయులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం.

– సుబ్బయ్య, ఎంఈఓ

రిటైర్డ్ కాక ముందే ఖాళీలు చూపించిన వైనం..

సున్నపువారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశాడు. అదే విధంగా కొత్తపేట పంచాయతీ వివేకానంద నగర్‌కి చెందిన ఎంపీయూపీపీఎస్ స్కూల్ ఉపాధ్యాయుడు ఆగస్టు 31న రిటైర్డ్ అయ్యారు. అయితే వీరిద్దరిని మండల విద్యాశాఖ అధికారులు ఆగస్టు 11వ తేదీనే జిల్లా ఉన్నత అధికారులకు రెండు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రాశారు. ఈ ఖాళీల్లో సర్దుబాటు పేరుతో వారికి అనుకూలమైన వారిని నియమించుకున్నారు. ఈ సర్దుబాటు పేరుతో ఒక యూనియన్‌లో సభ్యులుగా ఉన్న ఉపాధ్యాయులకు అనుకూలమైన స్థానాలు కేటాయించి తమకు అన్యాయం చేశారని ఆరోపిస్తున్నారు. తమకు జరిగిన అన్యాయంపై కొందరు ఉపాధ్యాయులు కోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు వేటపాలెం మండలంలో సర్దుబాటు పేరుతో జరిగిన మోసాలపై విచారణ చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

రఘురామ కృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలి

ప్రజా సంఘాల నేతల డిమాండ్

రేపల్లె రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన ఉండి శాసన సభ్యుడు రఘురామ కృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం బాపట్ల జిల్లా రేపల్లెలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జై భీమ్ యాక్సెస్ జస్టిస్ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ మాట్లాడుతూ ఆర్థిక, క్రిమినల్ నేర చరిత్ర కలిగిన పశ్చిమగోదావరి జిల్లా ఉండి శాసన సభ్యుడు రఘురామకృష్ణంరాజు ఈనెల 21న రహదారి పక్కన కట్టి ఉన్న రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఫ్లెక్సీను ఉద్దేశపూర్వకంగా చించి ఘోరంగా అవమానించారన్నారు. ఇటువంటి ఘాతుకానికి పాల్పడిన రఘురామ కృష్ణంరాజుపై దేశద్రోహం చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై స్పందించి రఘురామ కృష్ణంరాజుపై సుమోటోగా కేసు నమోదు చేయటంతో పాటు శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనకు ఎవరూ పాల్పడకుండా కృష్ణంరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు దారం సాంబశివరావు, కర్రా ప్రతాప్, గుమ్మడి కుమార్ బాబు, యడ్ల గోపిరాజు, దళిత ప్రజాసంఘాల నాయకులు చెరుకూరి లక్ష్మణరావు, వాగోలు రమేష్, మాల యువసేన కార్యదర్శి పెరికల రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలల హక్కుల ఉల్లంఘనపై ఆగ్రహం



నాదెండ్ల: యడ్లపాడు మండలం వంకాయలపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలల హక్కులకు ఉపాధ్యాయులు భంగం కలిగిస్తున్నారని, వారిపై చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. సోమవారం పాఠశాల నుంచి 67 మంది విద్యార్థులు గోడదూకి పారిపోయిన సంఘటన సంచలనం రేపిన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఆమె స్థానిక అధికారులతో కలిసి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం విద్యార్థులకు ఇస్తున్న రాగి జావ వాసన వస్తుండటంతో రాగిపిండి ప్యాకెట్లు పరిశీలించారు. గడువు తీరిపోయిన రాగిపిండి ప్యాకెట్లు వినియోగిస్తున్నట్లు గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటితో ఆహారం వడ్డిస్తే విద్యార్థులకు తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని మండిపడ్డారు. పరిశుభ్రమైన తాగునీరు సైతం అందుబాటులో లేదని, సరైన ఆహారం అందించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో లెట్రిన్‌లు కడిగించటం వారి హక్కులకు భంగం కలిగించినట్లేనన్నారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న తీరులో ప్రిన్సిపల్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. క్రీడా సమయాల్లో తమను ఆటలాడించకుండా పీఈటీ తీవ్రంగా కొడుతున్నాడంటూ విద్యార్థులు చెప్పటంతో పీఈటీ తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఒక వారం రోజులపాటు స్థానిక అధికారులు పాఠశాలను తరచూ సంప్రదించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే 1098, 100 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో హేమలత, ఎంఈవో నాగరత్నం, సీడీపీవో శాంతకుమారి, ఎస్సై బాలకృష్ణ ఉన్నారు.

శివాలయం అభివృద్ధికి చర్యలు

పెదకాకాని: భక్తులు, దాతల సహకారంతో శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఉప కమిషనర్ జీవీడీఎన్ లీలాకుమార్ అన్నారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన ఉప కమిషనరుగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఉప కమిషనరు, ఉప కార్యనిర్వహణాధికారిగా లీలాకుమార్ వ్యవహరించారు. మంగళవారం ఆయనకు దేవస్థాన అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజలో ఆయన పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- ఓ యువకుడు మృతి
- 15 గంటలు కాలువలో శ్రమిస్తే మృతదేహం లభ్యం
- మరో యువకుడు మృత్యుంజయుడు
- విలపిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు
- వడ్డవల్లిలో అలుముకున్న విషాదం



వినాయక ఊరేగింపులో షేక్ మహమ్మద్ రఫీ



రఫీ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

సత్తెనపల్లి: వినాయకుడి నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. ఇరువురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు సమీపంలోని బ్రిడ్జి వద్ద గల గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా మత సామరస్యాన్ని చాటి చెప్పేలా సత్తెనపల్లి మండలం వడ్డవల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో వినాయక విగ్రహాన్ని ఈనెల 7న ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసి తీసుకువచ్చి మండపంలో ఏర్పాటు చేశారు. 17 రోజులపాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. 17వ రోజైన సోమవారం రాత్రి వైభోపేతంగా వినాయక నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. రాత్రంతా వినాయక ఊరేగింపు కొనసాగి తెల్లవారుజామున 4.30 గంటల సమయానికి గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో వినాయక నిమజ్జనం చేశారు. ఆ సమయంలో 10 మంది వరకు కాలువలోకి దిగగా షేక్ మహ మ్మద్ రఫీ (18), గండేపల్లి తిరుపతిరావులు గల్లంతయ్యారు. ఇరువురు యువకులు గల్లంతయ్యారన్న సంగతి తెలుసుకున్న వినాయక నిమజ్జన కమిటీతోపాటు మరికొందరు రాత్రి సమయంలోనే గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. గల్లంతైన వారిలో గండేపల్లి తిరుపతిరావును కాపాడగలిగారు. మృత్యుంజయుడుగా తిరుపతిరావు బయటపడటంతో వెంటనే చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మరో యువకుడు షేక్ మహమ్మద్ రఫీ కోసం ఎంత గాలించినప్పటికీ ఆనవాళ్లు కనిపించలేదు. పోలీసులకు, వడవల్లి పెద్దలకు సమాచారం అందించడంతో పెద్దఎత్తున కాలువ వద్దకు చేరుకున్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ప్రత్యేకంగా 10 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి గల్లంతైన షేక్ మహమ్మద్ రఫీ కోసం వెతుకులాడారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో రఫీ మృతదేహం కాలువలో లభ్యమైంది. 15 గంటలపాటు శ్రమించి షేక్ మహమ్మద్ రఫీ మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించగా మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, వడ్డవల్లి వాసులు, వినాయక మండప కమిటీ సభ్యులు వచ్చి ఆవేదన వ్యక్తం చేయడంతో రోదనలు మిన్నంటాయి.

వంశోద్ధారకుడును కోల్పోయి ఆవేదన

పట్టణంలోని వడ్డవల్లికి చెందిన షేక్ పీరు బుడే, షేక్ జాకీరా దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పీరుబుడే తాపీ పనులకు వెళ్లి జీవనం వెళ్లదీస్తున్నారు. 10వ తరగతి వరకు చదువుకున్న కుమారుడు షేక్ మొహమ్మద్ రఫీ రెండేళ్ల కిందట చదువు మానేశాడు. తండ్రితోపాటు తాపీ పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. చేతికొచ్చిన వంశోద్ధారకుడు మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. రఫీ మృతి చెందడంతో పట్టణంలోని వడ్డవల్లిలో విషాదం అలముకుంది.

మాజీ ఎంపీ నందిగం సురేష్ అక్రమ అరెస్ట్

కుటిల రాజకీయానికి నిదర్శనం



సమావేశంలో మాట్లాడుతున్న చందోలు రాజ్‌కుమార్

వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు రాజ్‌కుమార్

బాపట్ల: మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అక్రమంగా అరెస్టు చేయటం కూటమి ప్రభుత్వ కుటిల రాజకీయాలకు నిదర్శమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ బాపట్ల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడారు. టీడీపీ కార్యాలయంపై దాడి చేశారంటూ ఏ సంబంధంలేని మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అరెస్టు చేయటం హేయమైన చర్యగా ప్రజలు భావిస్తున్నారన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగిన ఒక ఎస్సీ నాయకుడిని అరెస్టు చేస్తే పార్టీ శ్రేణులు మౌనంగా ఉంటాయనే తలంపుతో కూటమి ప్రభుత్వం కక్షసాధింపుల్లో భాగంగా నందిగంను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఎక్కడో కృష్ణానదిలో బోట్లు ఉంటే వాటిని కూడా నందిగం సురేష్ అనుచరులే వదిలి డ్యామ్ కూల్చివేసేందుకు కుట్రలు చేశారని టీడీపీ నాయకులు పేర్కొనటం చూస్తుంటే రాష్ట్రంలో ఏం జరిగినా సురేష్‌మీదే నెట్టేయాలని చూస్తున్నారని అర్థమౌతుందన్నారు.

- మందకృష్ణమాదిగ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలోని దళితులు బయటకు రావాలని కోరటం సరికాదన్నారు. ఉద్యమ నాయకులు ఒక పార్టీకి అనుకూలంగా, మరో పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడరాదని సూచించారు. చంద్రబాబు అరెస్టు జరిగినప్పుడు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఏపీ వచ్చిన మందకృష్ణ మాదిగ మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టుపై నోరుఎత్తకపోవటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎవరు ఎన్ని చేసినా ప్రజాక్షేత్రంలో వైఎస్సార్ సీపీకి ఉన్న బలాన్ని తగ్గించలేరన్నారు.

– మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు జైలులో కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవటం విచారకరమన్నారు. సమావేశంలో పార్టీ యూత్ జిల్లా జనరల్ సెక్రటరీ అంజనీ ప్రసాదరెడ్డి, పంచాయతీరాజ్ విభాగాల జిల్లా అధ్యక్షులు కొల్లా వెంకట్రావు, యద్దనపూడి ఎంపీపీ పులగం రజని, చల్లా రామయ్య, బాపట్ల పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, అంకమ్మరావు, గాజుల రమేష్, పి.రాంబాబు, యాతం బాబు, తన్నీరు అంకమ్మరావు, అడే చందు తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్ల నాడు అలిగి వెళ్లాడు

- నాడు భార్యాభర్తల మధ్య వివాదం
- నేడు కేసును ఛేదించిన పోలీసులు
- తల్లికి అప్పగింత!



దేవదానం ఆచూకీ కనుగొని తల్లి మనోహరికి అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్

నరసరావుపేటటౌన్: అదృశ్యమైన వ్యక్తి కేసును పోలీసులు ఛేదించారు. భార్య మీద కోపంతో ఇంటి నుంచి వెళ్లిన భర్త ఆచూకీ కనుగొని మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏడేళ్ల కిందట నమోదైన కేసుకు తెరబడినట్లు అయ్యింది. నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రామిరెడ్డిపేటకు చెందిన కల్వకురి జోసెఫ్ దేవదానంకు అదే ప్రాంతానికి చెందిన షైని సిల్వతో 2011లో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో 2017లో ఎవరికీ చెప్పకుండా దేవదానం ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయాడు. ఈ మేరకు భార్య ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి నుంచి దేవదానం కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసుపై ప్రత్యేక దృష్టి సారించిన వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్, దేవదానం స్నేహితులను విచారించారు. ఇటీవల కాలంలో స్నేహితుడికి ఫోన్ చేసినట్లు తెలుసుకొని ఫోన్ నెంబరు ఆధారంగా విచారణ చేపట్టారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా దేవదానం హైదరాబాద్‌లో ఉన్నాడని తెలుసుకున్నారు. సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు వెళ్లి దేవదానంను పట్టణానికి తీసుకొచ్చారు. భార్య, భర్తల మధ్య ఇంకా వివాదం అలానే ఉండటంతో దేవాదానంను తల్లి జెస్సీ మనోహరికి సీఐ అప్పగించారు. దీంతో ఏడేళ్ల కిందట నమోదైన అదృశ్యం కేసు సుకాంతమైంది.

ప్రాధాన్యతా రంగాలకు వేగంగా రుణాలివ్వాలి



గుంటూరు వెస్ట్: వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలకు వేగంగా రుణాలివ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వార్షిక ప్రణాళికలో భాగంగా తొలి త్రైమాసికంలో ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు కేటాయించిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లు నిర్దిష్ట కాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, అకాల వరద కారణంగా అన్ని రంగాలకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలు రీషెడ్యూల్ చేయాలని కోరారు. పరిహారం మంజూరు చేయడానికి సిద్ధం చేసిన ప్రభుత్వ జాబితాను బ్యాంకర్లు కూడా ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. కౌలు రైతుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని కోరారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో ఆమోదించిన దరఖాస్తులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, గృహ నిర్మాణదారులకు రుణాలకు త్వరగా మంజూరు చేయాలని సూచించారు. డీసీసీ కన్వీనర్ ఎస్.జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఆణిముత్యం సీతారాం ఏచూరి



లక్ష్మీపురం: దేశ రాజకీయా ల్లో ఎత్తిన ఎర్ర జెండాను దించకుండా ప్రజా సమస్యలపై పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సభకు నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షత వహించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంపాదన కోసమే రాజకీయాల్లోకి వస్తున్న నేతలు ఉన్న ఈ రోజుల్లో జీవితాంతం నిరాడంబరంగా ప్రజల కోసం పోరాడిన ఏచూరి లాంటి ఆణిముత్యాలు అత్యంత అరుదు అన్నారు. లౌకికవాద శక్తులను కూడగట్టడంలో కీలక భూమిక పోషించారని కొనియాడారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ.. భారత రాజకీయాలలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. కామన్ మినిమం ప్రోగ్రాం రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించారని పేర్కొన్నారు. ఉపాధి హామీ, అటవీ హక్కుల పరిరక్షణ, ఆర్‌టీఐ, ఆహార భద్రత, విద్యా హక్కు చట్టాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, విరసం అధ్యక్షుడు సీఎస్ఆర్ ప్రసాద్, ప్రజాగాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గేదెల దొంగలు

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన పి.గుడిపాడు గ్రామస్తులు
- కొరిశపాడు మండలంలో 20కి పైగా గేదెల అపహరణ
- పోలీసు స్టేషన్ వద్ద ధర్నాకు దిగిన బాధితులు



కొరిశపాడు పోలీసు స్టేషన్‌వద్ద బాధితులతో మాట్లాడుతున్న కొరిశపాడు ఎస్ఐ సురేష్

మేదరమెట్ల: గత కొంతకాలం నుంచి గేదెలను దొంగిలించుకుపోతున్న ముఠాలో కొంతమందిని సోమవారం అర్ధరాత్రి కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేసి కొరిశపాడు పోలీసులకు అప్పగించారు. వీరు గత కొంతకాంగా మండలంలోని బొడ్డువానిపాలెం, కొరిశపాడు, అనమనమూరు, మేదరమెట్ల, పి.గుడిపాడు గ్రామాల్లో 20 వరకు గేదెలను అపహరించుకుపోయినట్లు బాధితులు తెలిపారు. ఎప్పటిలాగే గేదెలను దొంగిలించేందుకు అర్ధరాత్రి దాటిన తరువాత పి.గుడిపాడు గ్రామానికి వెళ్లారు. ఇద్దరు దొంగలు నేరుగా గేదె వద్దకు వెళ్లి గొలుసును కట్ చేసి గేదె, దూడతో అక్కడ నుంచి వెళ్లగా, మరో ముగ్గురు దూరంగా ఆటోను పెట్టుకొని ఉన్నారు. అదేసమయంలో గేదెల యజమాని గేదెకు మేత వేసేందుకు వచ్చింది. అప్పటికే గేదెకు ఉన్న గొలుసు కట్‌చేసి ఉండటం, గేదెతోపాటు దూడ కూడా లేకపోవడంతో ఇరుగుపొరుగు వారిని లేపి దొంగలు వచ్చారనే సమాచారం తెలపడంతో ఇరుగుపొరుగు వారంతా కలసి నాలుగు దిక్కులకు పోయి వెతకడం మొదలు పెట్టారు. అటుగా వెళ్తున్న స్థానికులకు రోడ్డుపై ఆటోను పెట్టుకొని తచ్చాడుతున్న వ్యక్తులు ఎదురయ్యారు. కంగారుపడుతున్న వారిని గమనించిన కొందరు యువకులు సెల్‌ఫోన్‌లో ఆటోతో పాటు వ్యక్తి ఫొటో తీశారు. దీంతో బయపడిన వ్యక్తులు ఆటోతో పారిపోవాలని చూడటంతో స్థానికులు పట్టుకొని గ్రామానికి తీసుకెళ్లి దేహశుద్ధి చేశారు. ఇదంతా దూరం నుంచి చూసిన మిగతా దొంగలు గేదె, దూడను వదిలేసి పారిపోయారు. గ్రామస్తులు పట్టుకున్న వారిని కొరిశపాడు పోలీసులకు అప్పగించారు.

బాధితుల ధర్నా..

వారం రోజుల కిందట ఇదే గ్రామంలో రూ.లక్ష విలువైన గేదె దొంగతనానికి గురయింది. గేదెల దొంగలు పోలీసు స్టేషన్‌లో ఉన్నారన్న సమాచారం తెలుసుకున్న కొరిశపాడు మండలంలోని పలు గ్రామాల బాధితులతోపాటు పలు మండలాలకు చెందిన సుమారు 50 మంది బాధితులు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. కూలీనాలీ చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న తమలాంటి వారినుంచి గేదెలను దొంగిలించుకుపోయారని, తమకు న్యాయం చేయాలంటూ మేదరమెట్ల సెంటర్‌లో ధర్నా నిర్వహించి రహదారికి అడ్డంగా వాహనాలు ఉంచి నిరసన తెలిపారు. దీంతో ఎస్ఐ సురేష్ బాధితులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. గేదెల దొంగతనం చేసిన వారిలో మేదరమెట్ల, అనమనమూరు గ్రామాలకు చెందిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సాగులో సస్యరక్షణ అవలంభించాలి

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న వాణిశ్రీ

రేపల్లె రూరల్: సాగులో వ్యవసాయ అధికారులు సూచించిన సస్యరక్షణ పద్ధతులు అవలంభించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారుమూరు గ్రామంలో మంగళవారం క్షేత్రపర్యటన నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతులకు సాగులో సూచనలు చేయాలన్నారు. అదేవిధంగా రైతులు సాగులో తమకు కలిగే సందేహాలను వ్యవసాయ అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. రైతులు తమ పంట వివరాలను ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ ప్రక్రియతో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందటమే కాకుండా విపత్తులు సంభవించిన సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు ప్రాముఖ్యతను ఇవ్వాలని సూచించారు. అనంతరం సాగులో చేపట్టాల్సిన పలు అంశాలను రైతులకు వివరించారు. రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు, సర్పంచ్ గుడి రమాదేవి, వీఆర్ఓ ఆర్.వెంకటేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ సామ్రాజ్యం, ఏఈఓ బి.తేజస్విని, వీపీఏ నికేష్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో చిచ్చర పిడుగు

- అండర్–13 పోటీల్లో విశేష ప్రతిభ చూపుతున్న వెంకటేష్ రెడ్డి
- జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం



పులుగు వెంకటేష్ రెడ్డి

చీరాల రూరల్: చిన్న కుర్రాడే అనుకుంటే పొరపాటే. కాళ్లను ఒక మంత్రదండంలా కదపుతూ చిరుతలా దూసుకెళ్తూ ప్రత్యర్థులకు బాల్ దొరకనీయకుండా మెరుపువేగంతో గోల్ కొడతాడు. ఇటీవల అసోం రాష్ట్రంలోని జోర్హాత్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫుట్‌బాల్ అండర్–13 విభాగంలో చీరాల క్రీడాకారుడు పులుగు వెంకటేష్ రెడ్డి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ చూపాడు. అతి చిన్న వయస్సులోనే అత్యుత్తమ ప్రతిభతో క్రీడాధికారులను, క్రీడాభిమానులను ఆకట్టుకున్నాడు. చీరాల మండలంలోని కొత్తపాలెం పాత చీరాలకు చెందిన బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించే పులుగు రాఘవరెడ్డి తన కుమారుడైన వెంకటేష్ రెడ్డిని ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలులో 8వ తరగతి చదివిస్తున్నాడు. ఆటలంటే మక్కువచూపే వెంకటేష్‌రెడ్డి హైస్కూలులో నిర్వహించే సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంపుల్లో పాల్గొని తన ఆటకు మెరుగులు దిద్దుకున్నాడు. అతనిలో ప్రతిభను గుర్తించిన క్యాంపు ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య ప్రోత్సహించడంతో ఆటలో మరింత రాటుదేలాడు. ఈ ఏడాది ఆగస్టు 23 నుంచి 25 వరకు విజయవాడలోని సిద్ధార్థ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అండర్–13 విభాగంలో వెంకటేష్ రెడ్డి ఎంపికయ్యాడు. రాష్ట్ర జట్టుకు ఎంపికచేసిన అతడిని అనంతపురం జిల్లాలో నిర్వహించిన 15 రోజులు శిక్షణా శిబిరానికి తరలించి కఠోర శిక్షణ అందించారు. అనంతరం ఈనెల 12 నుంచి 14 వరకు అసోం రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచాడు. జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన వెంకటేష్ రెడ్డిని స్కూలు యాజమాన్యంతో పాటు పలువురు సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఘనంగా సత్కరించారు.

ఆయిల్ ఇంజిన్ దొంగలు అరెస్టు

వేమూరు: మాగాణి పొలంలో ఆయిల్ ఇంజిన్ దొంగతనం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు జంపని గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాసరరావు పొలం నుంచి ఆయిల్ ఇంజిన్‌ను అదేగ్రామానికి చెందిన కట్టెవరపు సాల్మాన్, పందిపాటి వంశీకృష్ణ, కొరవలిగంటి ప్రదీప్‌చంద్రలు మంగళవారం ఉదయం చోరీ చేశారు. విషయం తెలుసుకున్న మన్నె శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా తెనాలి ఆటో నగర్‌లో అమ్మినట్లు తెలిపారు. ఆయిల్ ఇంజన్ రికవరీ చేయడం జరిగిందని ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

భార్య, పిల్లల అదృశ్యంపై కేసు

చినగంజాం: భార్య, పిల్లలు కన్పించకుండా పోయారంటూ ఓ వ్యక్తి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పూలవారిపాలెం గ్రామానికి చెందిన పూల వెంకట సుబ్బారావుకు చినగంజాం మార్కెట్ సెంటర్‌కు చెందిన సూరినేని లక్ష్మీనారాయణ రెండో కుమార్తెతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరిక ఇద్దరు మగపిల్లలు. ఈనెల 23వ తేదీన బేల్దారి పనికి వెళ్లిన తను ఇంటికి వచ్చేసరికి భార్య, పిల్లలు కన్పించకుండా పోయారన్నారు. వారికోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అతని భార్య, పిల్లలు ఆటోలో చీరాల వైపు వెళ్లినట్లు స్థానికంగా కొందరు సుబ్బారావుకు తెలియజేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పడిగాపులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులు

భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు



మాట్లాడుతున్న ప్రసాదరావు

సత్తెనపల్లి: ఇసుక కొరత కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అడ్డాల వద్ద పడికాపులు కాయాల్సి వస్తుందని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్నాడు జిల్లాలో ఆన్‌లైన్ బుకింగ్ చూపించకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ఇళ్ల యజమానులకు అందడం లేదన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నా ఇచ్చిన సమయం అరగంటలో ఆన్‌లైన్ కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు మాత్రమే చేసుకోగలుగుతున్నారని, ఆన్‌లైన్ పరిజ్ఞానం లేని సామాన్యులకు ఇసుక దొరకడం లేదన్నారు. ఆన్‌లైన్ చేసుకుందామని సెంటర్‌కు వెళితే ఆ కంప్యూటర్‌లో పల్నాడు జిల్లా చూపటం లేదని, నెల్లూరు, కర్నూలు జిల్లాలు మాత్రమే చూపిస్తున్నదన్నారు. ఆ జిల్లాల నుంచి బుకింగ్ చేసుకొని ఇసుకను పల్నాడు జిల్లాకు తెచ్చుకోవాలంటే (4 టన్నుల) ట్రక్ ఇసుక రూ.10వేల నుంచి రూ.12 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ఊసే లేదన్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని ఇసుక డంపింగ్ యార్డులను పుష్కలంగా ఇసుకతో నింపి పల్నాడు జిల్లాను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరిచి ఆన్‌లైన్ బుకింగ్‌ను సరళతరం చేసి ఇసుకను సరఫరా చేయాలని, తద్వారా భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు మొగల్ ఆదాంషా, కార్యదర్శి గొట్టిపాటి సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.